



చినుకు పడితే చిత్తడే

- కంపుకొడుతున్న కూరగాయల మార్కెట్
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

కళ్యాణ్‌నగర్, జూలై 26: గోదావరిఖనిలోనే ఏకైక మార్కెట్ అయిన కూరగాయల మార్కెట్ సమస్యలతో కొట్టు మిట్టాడుతోంది. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. కూరగాయల కొనుగోలు చేయడానికి వచ్చే వినియోగదారులతో పాటు వ్యాపారులు కూడా ఇబ్బందులు పడుతున్నా కార్పొరేషన్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నెలనెలా లక్షలాది రూపాయల కిరాయిలు వసూలు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు తమకు కనీస వసతులను కూడా ఏర్పాటు చేయడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మార్కెట్ అంతా బురదమయంగా మారింది. కొనుగోలు దారులు రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కూరగాయల దుకాణాల మధ్య గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండడంతో నీరు నిలిచి కంపు కొడుతోంది. మార్కెట్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, బురదలో నుంచే నడవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు. వర్షానికి రోడ్డుపై ప్రవహించే నీరు తమ షాపుల వద్దకు వస్తున్నాయని, మార్కెట్ ఎదురుగా నిత్యం నీరు నిలిచి ఉండడంతో అందులో నుంచి రావాలంటే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోతున్నారు. తెల్లవారుజామున వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, మార్కెట్‌లో క్లీనింగ్‌ను చేపట్టకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొత్తగా వేసిన డ్రైనేజీ వల్ల కూడా సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని క్లీన్ చేయకపోవడంతో కంపుకొడుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

రూ. లక్షల కిరాయి కడుతున్నాం...

- కలవేని సంపత్, వ్యాపారి



కూరగాయల మార్కెట్‌లో షాపుల పేరిట నెలనెలా కార్పొరేషన్ అధికారులు లక్షల రూపాయలు కిరాయిలు వసూలు చేసుకుపోతున్నారు. కానీ కనీస వసతులు కల్పించడం లేదు. చిన్న వర్షానికే లోపల చిత్తడిగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. ఫిర్యాదు చేసినా కార్పొరేషన్ అధికారులు మాత్రం మార్కెట్ దిక్కు చూడడం లేదు. వినియోగదారులు రావాలంటేనే భయపడి పోతున్నారు.

ధర్మారం బస్టాండ్ మూల మలుపు వద్ద గుంతలు



గుంతలో ద్విచక్రవాహనదారుడి ఇబ్బందులు

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలో గల ఆర్టీసీ బస్టాండ్ మూల మలుపు వద్ద రోడ్డు గుంతలమయం అయింది. ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లి తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లే మార్గం మూలమలుపు వద్ద ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు గుంతలుగా మారింది. దీంతో ఇటు వైపు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వైపు, గణేష్‌నగర్ వైపు వెళ్లాలన్నా గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్తే ఆ గుంతలో వాహనం దిగబడుతోంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలుగా మారిన ఈ రోడ్డును మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ (ఫైల్)

7

పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ఎల్లంపల్లి

- 16.109 టీఎంసీలకు చేరుకున్న నీళ్లు
- మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు తరలించేందుకు రంగం సిద్ధం

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల సుమారు 23 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆదివారం కల్లా ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయి. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోక ముందే ప్రాజెక్టులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టడం పరిపాటి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల మిడ్ మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లకు వరద నీరు పెద్దగా రాకపోవడంతో ఆ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి. ▪ ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి

డీఎస్సీ పరీక్షకు 156 మంది హాజరు

పెద్దపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు 156 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి డి మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ నియామకాల డీఎస్సీ పరీక్షకు మొత్తం 185 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 156 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మంథని జేఎన్‌టీయూలో 100 మంది అభ్యర్థులకు 82 మంది, పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో 85 మంది అభ్యర్థులకు 74 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో విద్యాశాఖపరంగా ఒక అబ్జర్వర్, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో మాధవి తెలిపారు.

బియ్యం పంపిణీ

ఓదెల, జూలై 26: మండల కేంద్రానికి చెందిన నిరుపేద గడ్డం మల్లయ్య ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి శుక్రవారం ధర్మకర్తల మండలి సభ్యుడు కనికిరెడ్డి సతీష్ కుటుంబానికి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్యామ్, కొండ్ర లక్ష్మణ్, రాచర్ల రాజేశం, సారయ్య, ప్రభాకర్, కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే రుణాలను మంజూరు చేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి

కమాన్‌పూర్, జూలై 26: రైతు రుణమాఫీ కింద విడుదల చేసిన నిధులను బ్యాంకర్లు జమ చేసుకొని భవిష్యత్ అవసరాల కోసం రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని పెద్దపల్లి జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకర్లతో రుణమాఫీ, మళ్లీ రైతులకు రుణాలు మంజూరుపై చర్చించారు. అలాగే మండలంలోని పలు విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రొంపికుంట గ్రామంలో రైతులతో ముఖాముఖి చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను రుణమాఫీ పథకానికే వినియోగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అప్పులకు జమ చేసుకోవద్దని సూచించారు. ఈ నెలలోనే రెండో దఫా లక్షన్నర రూపాయల వరకు ఉన్న రుణాలకు, ఆ తర్వాత రూ. 2 లక్షల రుణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయనుందన్నారు. ప్యాక్స్‌లలో రైతుల వారీగా వివరాలు తీసుకొని ఎవరికి ఎంత మాఫీ అయిందో వివరాలు తెలుసుకున్నామన్నారు.

ఎవరైనా రైతులకు రుణమాఫీ కాకపోతే ఆయా రైతులు మండల వ్యవసాయాదికారులను కలిసి ఫిర్యాదు చేయాలని, ఆయా ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. ఎవరైనా రైతులకు రూ. లక్ష వరకు రుణమాఫీ జరగకపోతే ఆయా రైతులు ఆందోళన చెందకుండా మీ పరిధిలోని రైతు వేదిక ఏఈవోలను సందర్శించి ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించా రు. రికార్డుల్లో ఉన్న స్టాక్ గోదాముల్లో ఉన్న సరుకులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో బండి ప్రమోద్‌కుమార్, ఏఈవో అజ్మీర్, సురేష్ నాయక్, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి

కక్ష సాధింపు ధోరణిలో ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం

కోల్‌సిటీ, జూలై 26: ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కార్మికులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని ఐఎఫ్‌టీయూ నాయకులు చిలుక శంకర్, తిప్పని రాంకీ, రూపేష్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఏఎల్‌సీ కార్యాలయంలో యాజమాన్యం, కాంట్రాక్టర్, యూనియన్ ప్రతినిధుల మధ్య చర్చలు జరిగాయని, ఈ చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో వాయిదా పడ్డాయన్నారు. యాజమాన్యం మొండితనాన్ని విడనాడాలని, లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మధుకర్, పయ్యావుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి



ఎలిగేడు మండలంలో డ్రమ్‌లో నీరు పారబోస్తున్న సిబ్బంది

ఎలిగేడు, జూలై 26: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతీఒక్కరు జాగ్రత్త పడాలని ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా వారు ఎలిగేడు, నర్సాపూర్, లాలపల్లి, రాములపల్లి, శివపల్లి గ్రామాలను సందర్శించారు. కాగా నర్సాపూర్‌లో ఇంటింటా తిరుగుతూ శుచి శుభ్రత గూర్చి వివరించారు. ఇంటి ఏరియాలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సుధాకర్, ఏవో ఉమాపతి, కార్యదర్శులు లలిత, వీవోఏలు పద్మ, సునీత, అంగన్వాడీ టీచర్లు హేమలత, కళావతి, సూర్యకళ, ఆశా, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గ్రామాల్లోని వాడవాడలా తిరిగి గ్రామస్థులకు పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ఇండ్లలో ఇంటి పరిసరాలలో దోమల సంతతి ఉత్పత్తి కాకుండా దోమల నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్, వైద్య ఆరోగ్య, మెప్మా ఉద్యోగులు ప్రజలకు అవగాహణ కల్పించారు. డ్రై డేను పురస్కరించుకుని శుక్రవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో పారిశుధ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటా తిరుగుతు ఏ పాత్రలలో కానీ నీరు నిలువ చాలా కాలం నుంచి ఉన్న చో వాటిని పారబోయించారు. వీటి ద్వారానే దోమలు వ్యాప్తి చెందుతాయని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

కమాన్‌పూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి స్వాతి కోరారు. ఇటీవల కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల ఇంటి పరిసర ప్రాంతాల్లోని పాత్రల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉంటాయన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఓదెల: గ్రామాల్లో ప్రతి ఇంటిలో నీటి నిలువలు లేకుండా గ్రామస్తులను అప్రమత్తం చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద శుక్రవారం అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటిలో ప్రతి వైద్య సిబ్బంది ఇంటి యజమానులను కలిసి ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, అలాగే ఇండ్ల వద్ద శుభ్రంగా ఉండే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. గ్రామంలో వైద్య సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వస్తున్న జ్వరాల తీరును పరిశీలించాలని సూచించారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ ఆర్ కృష్ణ

పెద్దపల్లిటౌన్, జూలై 26: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులు, గరువులు చూపిన మార్గంలో నడుచుకోవాలని సీఐ ఆర్ కృష్ణ సూచించారు. డ్రగ్స్ వద్దు ప్రాణం ముద్దు... అనే నినాదంతో గంజాయి, మాదకద్రవ్యాలపై స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. గంజాయి తదితర మాదగ్రద్రవ్యాలకు ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మల్లేష్ , కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జలపాతం సందర్శనకు రావొద్దు: ఎస్ఐ

పెద్దపల్లి రూరల్, జూలై 26: కొన్ని రోజులుగా వానలు జోరుగా కురుస్తున్నాయని దీంతో సబ్బితం గౌరిగుండాల జలపాతం అధికంగా వరదనీటితో పారుతుందని, సందర్శనకు ఎవరు రావోద్దని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి సూచించారు. శుక్రవా రం మండలంలోని సబ్బితం గ్రామంలో ఏర్పాటు చేసిన బారికేడ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఐ ఆర్ స్వామి మాట్లాడుతూ వరదలు తగ్గాక వచ్చి సందర్శించవచ్చని సూచించారు. వారి వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నోటుబుక్‌లు అందజేత

కమాన్‌పూర్, జూలై 26: మండలంలోని పెంచికల్‌పేట్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయుడు డి సంపత్‌కుమార్ ఉచితంగా నోట పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ ఎం ఎండీ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

మంథని, జూలై 26: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుండటం ఎంతో సంతోషకరమని ప్రముఖ సామాజిక కార్యకర్తలు గోవిందు జావర్, కైలాష్ జావర్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో నైపుణ్యం కలిగిన నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, అలాంటివారికి సహాయం చేయాలని సంకల్పంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలి పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేత

సుల్తానాబాద్, జూలై 26: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను చాటుకున్న ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు నగదు పురస్కారాలను రిటైర్డు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయ దంపతులు మాదరబోయిన రాజేంద్రప్రసాద్ సరోజనీలు అందజేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9.3 గ్రేడ్ పొందిన సీహెచ్ అంజనా, 8.3 గ్రేడ్ సాధించిన సాయి గణేష్, హరిణి, అక్షిత, నవ్యలకు పదివేల నగదు అందజేశారు. ఇదే స్కూల్‌లో చదివి ఇటీవల జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం పొందిన కుర్న శ్రీధర్‌ను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు గాజుల అంజయ్య, గంగాదర్, ప్రభాకర్‌రెడ్డి, రఫీక్, సుజాత, సరిత, శ్రీవాణి, అరుణ, తదితరులతో పాటు పూర్వ విద్యార్థులు పొలాస ప్రదీప్, కుర్న శ్రీదర్, లెక్కల సంతోష్, పడాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: ఆర్డీవో



మొక్కకు నీరు పోస్తున్న ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి రూరల్, జూలై 26: ప్రతిఒక్కరూ విరివిరిగా మొక్కలు నాటితేనే రానున్న భవిష్యత్ ప్రాణవాయువుకు కొదవ లేకుండా ఉంటుందని పెద్దపల్లి ఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి గంగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బోంపల్లి గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా వనమహోత్సవంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్‌కి గుంతలు తవ్వగా ఆర్డీవో గంగయ్య మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం గ్రామంలోని మేరపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు వివరించాలని, లబ్ధిదా రులకు తప్పనిసరిగా ప్రతీ నెల పౌష్టికాహారం అందించాలన్నారు. వారి వెంట ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ముసురు వర్షానికి ఇల్లు నేలమట్టం



కూలిన ఇల్లు

ఓదెల, జూలై 26: మండలంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న ముసు రు వర్షానికి ఓదెలకు చెందిన మేడిచెలిమల పోచమ్మ అనే మహిళకు చెందిన ఇల్లు నేలమట్ట మయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఇంటి గోడలు తడిసి కూలిపోయింది. ఇంటిలో అందరు ఉండగా ఆకస్మాత్తుగా ఇల్లు కూలిపోతున్న సమయంలో కుటుంబం ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

అంగన్‌వాడీలను పూర్వ విద్యా కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ విద్యాకేంద్రాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల ఖాళీలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు లబ్ధిదారుల వివరాలు, పూర్వ విద్యా కేంద్రాల ఏర్పాటుకు అంగన్‌వాడీ టీచర్లకు అందించిన శిక్షణ మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ టీచర్ల విధి నిర్వహణను పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట అంగన్‌వాడీ టీచర్లను చిన్నచిన్న గ్రూపులుగా చేసి వారికి ప్రీ స్కూల్ టీచర్ శిక్షణ అందజేయాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేసి జిల్లాలో క్షేత్రస్థాయిలో వందశాతం ప్రీ స్కూల్ సమర్థవంతంగా నడిచేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు యూనిఫామ్ ధరించి వచ్చేలా చూడాలన్నారు. రాబోయే పదిరోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని, ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్, లైట్ ఉండేలా చూసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రంలో ఐదు సంవత్సరాలలోపు పిల్లల ఎదుగుదలను పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. పిల్లల ఎదుగుదల పర్యవేక్షణలో అవసరమైతే సిబ్బందికి శిక్షణ అందించాలని సూచించారు. గర్భిణులో అనేమియా, పోషకాహార లోపం ఉన్న పిల్లల వివరాలు సంబంధిత సూపర్‌వైజర్ దగ్గర ఉండాలన్నారు., పోషకాహార లోపం ఉన్న పిల్లల వివరాలను వైద్యశాఖ అధికారులకు అందించాలని సూచించారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందజేయాలని, ఆర్‌బీఎస్‌కే అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సేవలు పూర్తిస్థాయిలో అందుకోవాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణులు రెగ్యులర్‌గా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకుంటున్నారా లేదా అనే అంశాన్ని సూపర్‌వైజర్ పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సీడీపీవో కవిత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- **ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి..**

పెద్దపల్లిటౌన్: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం నిర్వహణ, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ శ్రీహర్ష సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలో ఉన్న 100 పడకల మాతాశిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం ద్వారా గర్భిణులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. పెద్దపల్లి మాతా శిశు ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రతీనెల 200 ప్రసవాలు, మంథని మాతాశిశు ఆసుపత్రి ద్వారా 50 ప్రసవాలు, సుల్తానాబాద్ ఆసుపత్రి ద్వారా 50 ప్రసవాలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ సబ్ సెంటర్ పరిధిలో ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణులను గుర్తించి వంద శాతం ఏఎన్సీ రిజిస్ట్రేషన్ చేయాలని, అవసరమైన టీకాలు సకాలంలో అందించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిబంధనల ప్రకారం శానిటేషన్ సిబ్బందిని షిఫ్టుల్లో నియమించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రసవం జరిగే గర్భిణులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు మ్యాపింగ్ చేయాలని, క్లిష్టమైన కేసులను పెద్దపల్లి మాతా శిశువు సంరక్షణ కేంద్రానికి, గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. జిల్లాలో మరింత మంది మత్తు డాక్టర్, రేడియాలజిస్టు, గైనకాలజిస్ట్‌లు అవసరమైతే తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లాలోని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో నకిలీ వైద్యులపై కొరడా

- ఆసుపత్రులను సీజ్ చేసిన తెలంగాణ వైద్య మండలి
- పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకుంటే చర్యలు: వైద్యాధికారి రాజ్‌కుమార్

కళ్యాణ్‌నగర్, జూలై 26: గోదావరిఖని పట్టణంలో అనుమతి లేకుండా ఆసుపత్రులను నడుపుతున్న నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి కొరడా ఝుళిపించింది. శుక్ర వారం తెలంగాణ వైద్య మండలి సభ్యుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస క్లీనిక్, శివ పైల్స్ క్లీనిక్ పేరిట చికిత్స చేస్తున్న ఆసుపత్రులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరిఖనిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొంత మంది క్లీనిక్‌లు ఏర్పాటు చేసి అల్లోపతి, ఆయుర్వేదం, పైల్స్ ఆసుపత్రులు నెలకొల్పారని, అందులోనే ల్యాబ్‌లను, మెడికల్ షాపులను ఏర్పాటు చేసి విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్, స్టెరైడ్స్ ఇస్తున్నట్టు గుర్తించామని, వారిపై ఎన్ఎంసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయనున్నట్టు చెప్పారు. అర్హత లేని వ్యక్తులు ప్రైవేట్‌గా క్లీనిక్‌లు పెట్టి ప్రాక్టీస్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని, పేరుకు ముందు డాక్టర్‌గా పెట్టుకోవద్దని, ఎవరైనా అనుమతి లేకుండా ప్రాక్టీస్ నిర్వహిస్తే వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్‌డీఏ సెక్రెటరీ గౌతం, బృందం పాల్గొన్నది.

క్లీనిక్‌లు మూసి వేసిన ఆర్‌పీఎంలు, పీఎంపీలు

గోదావరిఖనిలో శుక్రవారం పలు ఆసుపత్రులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న కొంతమంది ఆర్‌పీఎంలు, పీఎంపీలు క్లీనిక్‌లను, వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లను, మెడికల్ షాపులను మూసివేసి పరుగులు తీశారు. ఈ బృందం ఎక్కడెక్కడ తనిఖీ చేస్తుందో సమాచారం తెలుసుకుని వారిని అనుసరించారు. అధికారుల బృందం కొన్ని ఆసుపత్రులకు వెళ్లే సరికి మూసివేసి ఉన్నాయి.



ఆర్ఎంపీ క్లీనిక్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజ్‌కుమార్

కేంద్ర బడ్జెట్‌తో నిరాశ.. రాష్ట్ర బడ్జెట్‌తో ఊరట



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, జూలై 26: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ప్రజలకు నిరాశ మిగిల్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఊరట లభించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్ర వారం సీపీఐ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడం కోసం వివిద శాఖలకు కేటాయించిన నిధులను సమర్ధవంతంగా అమలు చేయాలన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న నాయకుడు బడ్జెట్ సమావేశాల్లో పూర్తి స్థాయిలో పాల్గొనకుండా బడ్జెట్ అంశాలను విని సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతా అనే అభిప్రాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై తన అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. అధికారం కోల్పోయామని తిరిగి అధికారం కోసమే విమర్శలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలు, నియంతలాగా వ్యవహరించడంతోనే ప్రజలు ఓడించారన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి అనేక సంక్షేమ పథకాల కోసం నిధులు కేటాయించారని, వాటిని అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ఇండ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. రేషన్ కార్డులపై ఇప్పటి వరకు ప్రభుత్వానికి ఎలాంటి కార్యాచరణ లేదన్నారు. ధరణి పోర్టల్‌లో అనేక మంది రైతుల భూములకు సంబంధించిన సమస్య లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. భూమాతతో రైతుల సమస్యల పరిష్కారి స్తామని చెప్పిన ప్రభుత్వం భూ సర్వే నిర్వహించి సాగు చేసుకుంటున్న అసలైన పట్టాదారులకు పట్టాదారు పాసు బుక్కులు అందించాలన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరిం చాలన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి చేనేత కుటుంబాలను ఆదుకో వాలన్నారు. ఈ సమావేశంలో సిద్దిపేట, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మంద పవన్, తాండ్ర సదానందం, వెన్న సురేష్, సీపీఐ కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్



మాట్లాడుతున్న నిషాని రాంచంద్రం

సుభాష్‌నగర్, జూలై 26: బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో రాజ్యాధికార సంకల్ప దివస్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రాంచంద్రం మాట్లాడుతూ ఛత్రపతి సాహూమహరాజ్ నిమ్న కులాలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేశారని తెలిపారు. 1902 జూలై 26న వెనకబడిన కులాలు, అంటరాని కులాలకు, మహిళలకు విద్య ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని అన్నారు. సాహూ మహరాజ్ బ్రిటీష్ ఇండియాలోని కొల్హాపూర్ సంస్థానానికి రాజు అని తెలిపారు. వెనకబడిన, నిమ్నవర్గాల పిల్లలకు నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారని, విద్య దూరం అయిన కులాలకు ప్రత్యేక పాఠశాలలు స్థాపించాడని, మహాత్మా జ్యోతిబాపూలే స్థాపించిన పాఠశాలలకు ఆయన నిధులు కేటాయించి నిమ్న కులాలకు విద్యావ్యాప్తి కోసం కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలను, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దడ్డే శ్రీనివాస్, దొడ్డె సమ్మయ్య మాతంగి అశోక్, మంద బాలయ్య, కల్లెపెల్లి రాజేందర్, మాంకాలి తిరుపతి, పల్లె ప్రశాంత్‌గౌడ్, మారపెల్లి మొగిలయ్య పాల్గొన్నారు. బీఎస్పీలో ఎలగందల్‌కు చెందిన బోనాల సంతోష్, కిన్నెర రజనీకాంత్ చేరారు. జిల్లా అధ్యక్షుడు దొడ్డె శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గంజాయి కేసులో పలువురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని చింతకింది భానుచందర్, గోనె ఉదయ్ రాపల్లి వాగు వంతెన వద్ద గంజాయి అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని విచారించారు. కరీంనగర్‌లోని గుర్తుతెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు తేలింది.

ఇల్లంతకుంట: మండలకేంద్రానికి చెందిన మహమ్మద్ జమీర్ గంజాయి కేసులో అరెస్టు చేసినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆటో నడుపుకునే జమీర్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలానికి చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేస్తున్నాడు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకొని గంజాయి కిట్ ద్వారా పరీక్షించగా పాజిటీవ్‌గా తెలింది. జమీర్ వద్ద నుంచి 100 గ్రా. గంజాయి, మొబైల్ స్వాధీనం చేసుకున్నారు.

సిరిసిల్ల క్రైం: రెండు గంజాయి కేసుల్లో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వీరబోయిన అజయ్, సిరిసిల్ల మండలం చిన్న బోనాలకు చెందిన అవునూరి ప్రశాంత్, పండుగ మహేశ్, సందవేణి మహేశ్ ఉన్నట్లు పేర్కొన్నారు. 150 గ్రాముల గంజాయి, 5 గంజాయి సిగరెట్లు, రెండు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

FARNAZ

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు



వృద్ధుడి చేతులపై కుక్కగాట్లు

గంభీరావుపేట, జూలై 26: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో వృద్ధుడిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. లింగన్నపేటకు చెందిన లక్ష్మణ్ పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. రోడ్డుపై వెళ్తున్న లక్ష్మణ్‌ను వెంటపడి మరీ దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వెంటనే కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, నాయకులు గౌరీ శంకర్ అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్‌కు తన వంతు సాయంగా హమీద్ వెయ్యి రూపాయలు అందజేశారు.

16.109 టీఎంసీలకు చేరుకున్న శ్రీపాద ఎల్లంపల్లి



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

- మోటర్లు ఆన్ చేసి మిడ్ మానేరుకు నీటిని తరలించేందుకు రంగం సిద్ధం
- నీటిపారుదల శాఖ అధికారుల సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోనున్నది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల వల్ల సుమారు 23 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ఆదివారం కల్లా ప్రాజెక్టులోకి పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయి. అయితే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోకముందే ప్రాజెక్టులు గేట్లు ఎత్తి గోదావరిలోకి నీటిని వదిలిపెట్టడం పరిపాటి. అయితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గల మిడ్ మానేరు, లోయర్ మానే డ్యామ్‌లకు వరద నీరు పెద్దగా రాకపోవడంతో ఆ ప్రాజెక్టులు వెలవెలబోతున్నాయి.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తకుండా ఒకటి, రెండు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు నంది మేడారం నంది పంప్‌హౌస్, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లో గల గాయత్రి పంప్‌హౌస్ మోటార్లను ఆన్ చేసి మిడ్ మానేరు నీటిని తరలించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో గోదావరి పరివాహక ప్రాంత నీటిపారుదలశాఖ అధికారులతో ఉన్నతాధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తక్షణమే ఎల్లంపల్లి ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తేనే కొంత మేలు జరుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు 23,701 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. దీంతో ప్రాజెక్టు 16.109 టీఎంసీల నీటిమట్టానికి చేరుకున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం వస్తున్న వరద నీరు ఇలాగే కొనసాగితే శనివారం సాయంత్రం కల్లా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టనికి చేరుకోనున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి మట్టానికి చేరుకోక ముందే నీటిని ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎగువప్రాంతంలో వర్షాలు కురవకపోవడంతో..

రాజన్నసిరిసిల్ల జిల్లాలో గల శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ మిడ్ మానేరు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. కరీంనగర్ శివార్లో గల లోయర్ మానేర్ డ్యాం పూర్తి నీటిమట్టం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఈ రెండు రిజర్వాయర్ల ఎగువ ప్రాంతంలో వర్షాలు అంతగా కురవక పోవడంతో వరద నీరు తక్కువగా వస్తున్నది.

ఈ నేపథ్యంలో శ్రీపాద ఎల్లంపల్లి నుంచి నీటిని తరలిస్తే ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తున్నది. మిడ్ మానేరుకు తరలించిన నీటిని, అవసరమైతే ఎల్ఎల్ఎండీకి, లేదంటే మల్లన్న సాగర్‌కు కూడా తరలించుకునే అవకాశాలు ఉన్నాయి. వర్షాల వల్ల వచ్చిన నీటిని వచ్చినట్లే మోటార్ల ద్వారా ఎత్తిపోస్తే వానా కాలం సీజన్, వచ్చే యాసంగి సీజన్‌కు సాగునీటికి డోకా లేకుండా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకటి, రెండు రోజుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వస్తున్న అదనపు వరద నీటిని గేట్లు ద్వారా గోదావరిలోకి వదిలి పెట్టకుండా, నంది పంప్ హౌస్, గాయత్రి పంప్ హౌస్‌లను ఆన్ చేసి నీటిని మానేరులోకి ఎత్తిపోయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

ఎస్సారెస్పీకి పెరిగిన వరద

ప్రాజెక్టులోకి 25,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. శుక్రవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 25,150 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 28.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 59. 766 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 564 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 22.360 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 2.302 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ

మల్యాల, జూలై 26: మండలంలోని రాజారం ప్రభుత్వ పాఠశాలలో గురువారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. పాఠశాల ఆఫీస్ గది తాళాలు పగులగొట్టి అందులోని కంప్యూటర్‌తో పాటు సంబంధిత పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన్నట్లు పాఠశాల ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇటీవలే మన ఊరు-మన పాఠశాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కూడా ఎత్తుకెళ్లడానికి ప్రయత్నం చేసి, గదిలోని వస్తువులను అస్తవ్యస్తంగా పడేశారు. సంఘటన స్థలాన్ని బట్టి తెలుస్తుందని తెలిపారు. కాగ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీఐ నీలం రవి, ఎస్సై నరేష్‌కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో పరిసర ప్రాంతాలను గాలించారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వాలి

గ్రామాల్లో అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై ఏ.నరేష్‌కుమార్ మం డల ప్రజలను కోరారు. ఇటీవల పాఠశాలలు, మండలంలో దొంగతనాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఇళ్లకు తాళం వేసి వెళితే బంగారు ఆభరణలు, నగదు వెంట తీసుకెళ్లాలని సూచించారు.

పారిశుధ్య కార్మికురాలిపై దాడి

ఎల్లారెడ్డిపేట, జూలై 26: పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని పారిశుధ్య కార్మికురాలు ర్యాకం నర్సవ్వపై యువకుడు బత్తుల రాజు దాడి చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని నర్సవ్వ పారిశుధ్య కార్మికురాలిగా పని చేస్తోంది. ఇంటి పక్కన ఉన్న బత్తుల రాజుతో కొంత కాలంగా స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో ఒంటరిగా ఉన్న నర్సవ్వపై రాజు దాడి చేయడంతో ఆమె తీవ్ర గాయపడింది. స్థానికులు గమనించి అడ్డుకున్నారు. తీవ్ర గాయాలైన నర్సవ్వను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేగంపేట్‌లో వ్యక్తిపై..

రామగిరి: మండలంలోని బేగంపేట్ గ్రామంలో గురువారం రాత్రి వాట్సాప్ మేసెజ్‌తో వచ్చిన వివాదం చివరికి ఓ వ్యక్తిపై దాడికి దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన సాయి అనే వ్యక్తి గ్రామానికి సంబంధించిన గ్రూప్‌లో అభ్యంతరకరంగా ఉన్న వ్యాఖ్యలతో కూడిన అంశాన్ని వాట్సాప్‌లో పోస్టు చేశాడు. వాట్సాప్ మెసెజ్ విషయంపై అడిగిన దాసరి శ్రీనివాసును సాయితో పాటు సురేందర్, దశరథం అనే మరో ఇద్దరు వ్యక్తులు నీకు ఎందుకు అంటూ దుర్భాషలాడుతూ బీర్ సీసాను పగలగొట్టి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, జూలై 26: మండలంలోని కేశనపల్లి గ్రామానికి చెందిన మాకోటి లక్ష్మయ్య (55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మధుసూదన్ రావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు సంవత్సరాల నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతూ కరీంనగర్‌లో చికిత్స పొందుతూ ఉండేవాడని ఈ మధ్యకాలంలో కిడ్నీ నోప్పి తీవ్రత ఎక్కువగా కావడంతో శుక్రవారం పత్తి చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గమనించిన పక్కన ఉన్న రైతులు కుటుంబ సభ్యుల సహకారంతో వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

రామగిరి, జూలై 26: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన కాసాని వినోద్(32) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వినోద్‌కు కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డుప్రమాదంలో కాలు విరిగిపోగా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. విరిగిన కాలుతో మేస్త్రీ పనులు చేయలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. మానసికంగా కలత చెందిన వినోద్ శుక్రవారం తెల్లవారు జామున తాడుతో దూలనికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య కాసాని అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసీఆర్ పాలనలో నిండుకుండలా గోదావరి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



గోదావరినదిని పరిశీలిస్తున్న కేటీఆర్

గోదావరిఖని, జూలై 26: కేసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండాలా ఉండేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఎండిన గోదావరి దర్శనమిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో పర్యటనకు వచ్చిన కేటీఆర్ శుక్రవారం ఉదయం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి వంతెనపై ఆగి గోదావరినదిని పరిశీలించారు. ఎండిన గోదావరినదిని చూసి కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కన్నేపల్లి పంప్‌హౌస్ నడిపి నీటిని ఎత్తిపోస్తే గోదావరినది నిండుకుండలా ఉంటుందని కేటీఆర్ అన్నారు. పర్యటనలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతి

సిబ్బంది నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మెట్‌పల్లి రూరల్, జూలై 26: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ క్యాంపులోని గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న రాజారపు గణాధిత్య(13) ఫిట్స్‌తో శుక్రవారం మృతి చెందాడు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థి మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. మెట్‌పల్లి అనుసంధానమైన ఆరపేట గ్రామానికి చెందిన రాజారపు మహేష్, లావణ్యలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు పుట్టిన రెండు నెలలకు, చిన్న కుమారుడు ఆరేళ్ల కింద ఫిట్స్‌తో మృతి చెందారు. రెండో సంతానం అయిన గణాధిత్యను మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాలలో ఇటీవలే చేర్పించారు. శుక్రవారం ఉదయం పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి గణాధిత్యకు ఫిట్స్ వచ్చింది ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సమాచారం అందించారు. విద్యార్థి తండ్రి వెంటనే పాఠశా లకు చేరుకుని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.



గణాధిత్య(ఫైల్)

పాఠశాల ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వల్లే విద్యార్థి మృతి చెందాడని తల్లిదండ్రులతో పాటు బంధువులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ప్రిన్సిపల్ విద్యసాగర్‌ను వివరణ కోరగా విద్యార్థులు అంతా కలిసి వార్డులో నిద్రిస్తున్నారని, అంతలోనే గణాధిత్యకు ఫిట్స్ వచ్చినట్లు తోటి విద్యార్థులు సిబ్బంది దృష్టికి తేవడంతో విద్యార్థి తల్లిదండ్రులకు వెంటనే సమాచారం అందించినట్లు వివరణ ఇచ్చారు.

భయంతో ఇంటి దారి పట్టిన విద్యార్థులు

మండలంలోని పెద్దాపూర్ క్యాంపు గురుకుల పాఠశాలలోని విద్యార్థులు భయంతో ఇంటి దారి పట్టారు. పాఠశాలలో శుక్రవారం వేకువ జామున విద్యార్థి గణాధిత్య ఫిట్స్‌తో మృతి చెందడంతో తోటి విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.

ఇండియన్ బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన



బ్యాంకు ఎదుట మేనేజర్‌తో మాట్లాడుతున్న రైతులు

శంకరపట్నం, జూలై 26: తమకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ కాలేదని మండలంలోని మొలంగూర్ ఇండియన్ బ్యాంకు ఎదుట శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఇతర బ్యాంకుల్లో రైతులకు లక్ష రూపాయల లోపు రుణమాఫీ అయ్యిందని, ఇండియన్ బ్యాకులో ఎందుకు కాలేదని రైతులు బ్యాంకు మేనేజర్‌ను నిలదీశారు. రుణమాఫీ జాబితా పంపించారా అని మేనేజర్‌ను ప్రశ్నించారు. జాబితా పంపిస్తే తమకు చూపించాలని మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో మండల వ్యవసాయాధికారిని ఫోన్ ద్వారా సంప్ర దించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆయన చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 26 : వరకట్న వేధింపుల కేసులో మండలంలోని వెంకట్రావుపల్లెకు చెందిన ఆంజనేయులును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆంజనేయులు తన భార్య ఎనగంటి రేఖను వరకట్నం కోసం వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లి శాంతమ్మ ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి



బొందయ్య మృతదేహం

చిగురుమామిడి, జూలై 26: మండలంలోని రేకొండకు చెందిన మొగిళి బొందయ్య (70) ప్రమాదవ శాత్తు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందాడు. బొందయ్య గొర్రెలను మేపడానికి వెళ్లాడు. శుక్రవారం సాయంత్రం గొర్రెలను ఇంటికి తోలుకొస్తున్నక్రమంలో ఓ గొర్రె పిల్ల సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడింది. దానిని రక్షించడానికి బొందయ్య తాడు సహాయంతో బావిలోకి దిగాడు. గొర్రె పిల్లను బావిలోంచి బయటకు తీశాడు. బావి నుంచి బయటకు వస్తున్న క్రమంలో తాడు తెగిపోయి బావిలో పడి నీట మునిగి మృతి చెందాడు. బొందయ్య కుటుంబసభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జూలై 26: ఎల్లారెడ్డిపేట పరిధిలోని కిష్టంపల్లి శివారులో శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి మండలంలోని రాచర్ల గొల్లపల్లికి చెందిన మార్వాడి రాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రాములు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్సారెస్పీ నిర్మాణం ప్రారంభించి 61 ఏళ్లు పూర్తి

జగిత్యాల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ వరద ప్రదాయినిగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంఖుస్థాపన జరిపి నేటికి 61 ఏళ్లు పూర్తవుతోంది. 1963 జూలై 26వ తేదీన అప్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పోచంపాడ్ వద్ద పునాది రాయి వేసిన రోజును పలువురు రైతులు, అధికారులు నెమరువేసు కుంటున్నారు. నీటి పారుదల జలాశయాలు ఆధునిక దేవాలయాలుగా ప్రధాని నెహ్రూ అభివర్ణించారని గుర్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోచంపాడ్ ప్రాజెక్టు వద్ద పండిట్ నెహ్రూ విగ్రహానికి శుక్రవారం పలువురు ఎస్సారెస్పీ అధికారులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా డ్యామ్ వద్ద గల నీటి ప్రవా హంలో గోదావరి తల్లికి పూలు సమర్పించారు. ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈ చక్రపాణి, డీఎస్ఈ లాల్ సింగ్, డీఈఈలు గణేష్, సుకుమార్, రఘుపతి, డ్యామ్ ఏఈఈ వంశీ పాల్గొన్నారు.



నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

ఎన్టీపీసీలో ముగిసిన కేవీ రీజినల్ స్పోర్ట్స్

జ్యోతినగర్, జులై 26: రామగుండం ఎన్టీపీసీలో రెండు రోజులుగా జరుగుతున్న కేంద్రియ విద్యాలయాల(కేవీ) రీజినల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగశాయి. ఎన్టీపీసీ జ్యోతిక, స్పందన ఇండోర్ స్టేడియంల్లో జరిగిన పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌లోని కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.శ్రీజ (పికెట్ కేంద్రియ విద్యాలయం) ప్రథమ, దండు తేజశ్విని (నల్గొండ కేవీ) ద్వితీయ, ఏంజెల్ (గచ్చిబౌలి కేవీ) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్ 19 విభాగంలో కె జాహ్నవి (కాకినాడ కేవీ) మొదటి స్థానం, ఎస్ సహర్ష(పికెట్) రెండో స్థానంలో నిలిచారు. పతకాలు సాధించిన విద్యార్థులు హైదరాబాద్ రీజియన్ జట్టుకు ఎంపికయ్యారని, త్వరలో జరగబోయే కేంద్రియ విద్యాలయాల సంఘటన్ ఆధ్వర్యం లో జరిగే జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొం టారని ఎన్టీపీసీ కేంద్రియ విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శోభన్‌బాబు తెలిపారు. క్రీడా పోటీలను విజయవంతం చేయడంలో సహకరించిన ఎన్టీపీసీ యాజమాన్యానికి, ఇతర సిబ్బంది, కోచ్, ఉపాధ్యాయులకు శోభన్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.



పతకాలు అందుకున్న అండర్ 19 విజేతలు

బెంబేలెత్తిస్తున్న చోరీలు

- వరదకాలువకు అమర్చుకున్న ఫ్యూజ్‌లను వదలని దొంగలు
- వరుస చోరీలతో రైతుల ఆందోళన

మల్యాల, జూలై 26: వరదకాలువ నీటి ఆధారంగా సాగు చేసుకునే రైతులు దొంగతనాలతో ఆందోళన చెందుతున్నారు. కాలువలోని నీటిని వినియోగించుకునేందుకు గాను ఏర్పాటు చేసుకున్న పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను గత కొన్నేళ్లుగా గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తు కెళ్లడంతో బెంబె లేత్తుతున్నారు. ప్రతి ఏటా ఇదే విధంగా వరుసగా కొనసాగుతుండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ నుంచి బల్వంతాపూర్ శివారు వరకు గల దాదాపు 14కి.మీల వరద కాలువకు వందలాది రైతులు పంప్‌మోటార్లను అమర్చుకొని సాగు చేసుకుంటున్నారు.

అయితే గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో పంప్‌మోటార్లలోని కాపర్ తీగలను ఎత్తుకెళుతున్నారు. కొన్నేళ్లుగా కాపర్ తీగలతో పాటు విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళుతున్నారు. తాజాగా గురువారం అర్ధరాత్రి కూడా నూకపల్లి శివారు నుంచి మల్యాల శివారు వరకు గల విద్యుత్ పంప్‌సెట్ల వద్ద స్టార్టర్ బాక్స్‌లకు అమర్చిన 20 మంది రైతు లకు సంబంధించిన ఫ్యూజ్‌లను ఎత్తుకెళ్లారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడం, పంటల సాగు కొనసాగు తున్న తరుణంలో దొంగలు కాపర్, విద్యుత్ తీగలు, ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఫ్యూజ్‌లు ఎత్తుకెళ్లిన్నట్లు చూపుతున్న రైతులు

గతంలో దొంగలు చిక్కినా..

ఈ ప్రాంతంలో కొన్నాళ్ల క్రితం పంప్‌మోటార్లను పగుల గొట్టి కాపర్‌తీగలు, విద్యుత్ తీగల దొంగతనాలకు పాల్పడిన దొంగలు గత రెండేళ్ల క్రితం పట్టుబడగా కేసులు కూడా నమోదు అయ్యాయి. వారి వద్ద తీగలు రికవరీ చేసినా రైతులుకు అందలేదు. అదిఅలా ఉంటే దొంగతనాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా పంటల సాగు సీజన్‌లలో వరుస దొంగతనాలతో రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విద్యుత్ తీగలలో ఉండే కాపర్ తీగల కోసం నిప్పంటించి కాపర్‌నే వేరు చేసి అమ్ముకుంటారు. గత నెల రోజుల నుంచి మూడు సార్లు నూకపల్లి శివారు నుంచి బల్వాంతపూర్ వరకు పదుల సంఖ్యలో రైతుల విద్యుత్ తీగల చోరీకి గురి అయ్యాయి. దీంతో ఇటీవల రైతులు కాపర్ తీగలకు బదులు అల్యూమినియంతో ఉండే తీగలను ఏర్పా టు చేసుకుంటున్నారు. దొంగల బెడదను అరికట్టడానికి తగు చర్యలు తీసుకోవల్సి ఉంది.

నష్టపోవాల్సి వస్తుంది

రాయలింగం, రైతు, నూకపల్లి

వరదకాలువకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్ల కాపర్, విద్యుత్ తీగలను తరచూ ఎత్తుకెళ్లడంతో మళ్లీ కొనుగోలుతో నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగుకు కూడా ఇబ్బందులు అవుతున్నాయి. కొన్ని సార్లు రాత్రి వేళ్లల్లో కాపాలా కూడా ఉండాల్సి వస్తుంది. దొంగతనాల నివారణకు పోలీసులు తగు చర్యలు తీసుకోవాలి. పర్యవేక్షణ కూడా చేయాలి.

'కార్గిల్' అమరవీరులకు ఘన నివాళి






సుల్తానాబాద్‌లో మాజీ సైనికులున సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, కార్గిల్ అమరులకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు, మనాలీ ఠాకూర్, సీఐ ఇంద్రసేనారెడ్డి, నాయకులు

పెద్దపల్లి రూరల్, జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం మండలంలోని పెద్దబోంకూర్‌లో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమరులైనా సైనికులకు కొవ్వొత్తులతో నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సైనికులు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా శత్రుదేశ సైనికులతో పోరాడి ఉగ్రవాదుల నుండి దేశప్రజలను, భారత భూభాగాన్ని అనునిత్యం రక్షణ కల్పిస్తున్నారని అన్నారు. అమరులైన సైనికులను గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తులతో నివాళులర్పించామన్నారు. కార్యక్రమంలో కల్వల తిరుపతిగౌడ్, వెంగల రాజయ్య, రవి, గండు వంశీకృష్ణ, ఇంతియాజ్, అడిచెర్ల రవి, రమేష్, ఆదర్శ్, బోయిని రాజు, శ్రీదత్త తదితరులు పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌లో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కెడెట్లు, విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి వీరసైనికులకు నివాళులర్పించారు. వీర జవాన్ల సేవలను గుర్తు చేసుకున్నారు. దేశ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ కెడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● రిటైర్డ్ సైనికులకు సన్మానం..

సుల్తానాబాద్: కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందిన సైనికులు నారాయణ, వెంకటస్వామి, పవన్‌రెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. శుక్రవారం సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్గిల్ పోరాటంలో పాల్గొని వీరమరణం పొందిన వారికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కో ఆర్డినేటర్లు వల్స నీలయ్య, జూలూరి అశోక్, కార్యదర్శి పిట్టల వెంకటేశం, కోశాధికారి పూసాల సాంబమూర్తి, రాయల్ల నవీన్, తమ్మనవేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ: కార్గిల్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లకు కార్గిల్ దివస్ సందర్భంగా శుక్రవారం గోదావరిఖనిలో ఘన నివాళులర్పించారు. స్థానిక మెయిన్ చౌరస్తాలో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ హాజరయ్యారు. కొవ్వొత్తులతో అమర జవాన్లకు నివాళులర్పించారు. అమరుల త్యాగాల వల్లే ప్రజలు క్షేమంగా ఉన్నారన్నారు. వారి వీరమరణం త్యాగం ఎప్పుడూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాతిరి గంగరాజు, ఈ శ్రీనివాస్, భాస్కర్, తిరుమల్‌రెడ్డి, శంకర్‌రావు, సలావుద్దీన్, కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, ముస్తాఫా, పెద్దెల్లి తేజస్విని, కొమ్ము వేణు, నాయకులు కల్వల సతీష్, దూళికట్ట సతీష్, సింహాచలం, రత్నాకర్ పాల్గొన్నారు.

● లయన్స్‌క్లబ్ గోదావరిఖని స్ఫూర్తి ఆధ్వర్యంలో మెయిన్ చౌరస్తాలో కార్గిల్ అమరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది సిరిగ సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నార్ల ప్రసాద్, మామిడిపెల్లి శ్రీధర్, కోదాటి ప్రవీణ్, గుంత వినోద్, తంగెడ రమణారావు, బొల్లు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన కార్గిల్ దివస్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హాజరై అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాస్, నాయకులు అయోధ్య రవీందర్, సైతరి రాజు, ముప్పె సంపత్, అడిగొప్పుల రాజు, దువాసి తిరుపతి, అజయ్, మల్లికార్జున్, సిగిరి సంజయ్, రావుల శ్రీనివాస్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పాటి నానికి మహానంది పురస్కారం

మంథని, జూలై 26: మంథనికి చెందిన ప్రముఖ నృత్య కళాకారుడు తూర్పాటి నాని మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికయ్యాడు. 2024 సంవత్సరానికి భరతనాట్యం నృత్య కళాకారుడు నాని జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో ప్రదర్శనలు చేసినందుకు విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజ గానసభలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. నానికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మత్స్య కార్మికులను విస్మరించిన ప్రభుత్వం

మంథని, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి నిధులు కేటాయించకపోవడంతో సిగ్గుచేటు అని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్ పోత రవేన క్రాంతికుమార్ శుక్రవారం పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటులో మత్స్య కార్మికులు తమ వంతు సహకారం అందించిన విషయం మరువరాదన్నారు. శాఖలో ముదిరాజ్‌లు, బెస్త, ఎస్సీ, ఎస్టీ లాంటి అన్ని బలహీనవర్గాల కులాలు ఉన్నందున ప్రభుత్వం తమ మత్స్యశాఖకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించి కొత్త పథకాలు ప్రవేశపెడుతారని కలలు కన్న కార్మికుల ఆశల్లో నీళ్లు చల్లారన్నారు.

'సఖి' సేవలపై అవగాహన కల్పించాలి: కలెక్టర్

పెద్దపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సఖి వన్ స్టాప్ కేంద్రాల ద్వారా అందించే సేవలపై మహిళలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సఖి కేంద్రం, తెనుగు వాడలోని అంగన్వాడీ కేంద్రం, శ్రీనివాస థియేటర్ సమీపంలో గల బాలల రక్ష భవన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ వేధింపులు, హింసల నుంచి రక్షణ కల్పించడానికి వారికి అవసరమైన అన్నిరకాల సహాయాన్ని అందించడానికి సఖి వన్ స్టాప్ సెంటర్ కృషి చేస్తుందని అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా సఖి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలకు ప్రచారం కల్పించాలని, ప్రతీ మహిళకు సఖి కేంద్రంపై అవగాహన వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. సఖి వన్ స్టాప్ కేంద్రం ద్వారా బాధిత మహిళకు తక్షణ సహాయంగా కౌన్సెలింగ్, వైద్య సహాయం, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం, పోలీస్ సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేయాలని, ఇందులో భాగంగా ప్రతిరోజు నిర్ధేశించిన కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలుచేయాలని కలెక్టర్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో రెగ్యులర్‌గా పిల్లల ఎదుగుదలను మానిటర్ చేయాలని కలెక్టర్ సూచించారు. బాలల రక్ష భవన్ పరిశీలించిన కలెక్టర్ సంబంధిత కార్యాలయం రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. భవన్ నుంచి చేపట్టాల్సిన హోమ్ విజిట్‌లను తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

చేయాలని, రెగ్యులర్‌గా హోమ్ విజిట్ చేయాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న సఖి కేంద్రం భవనాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రహరీ, గేట్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఉన్న పనులు త్వరగా పూర్తిచేసి సఖి కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రంగంపల్లిలో ఉన్న బాయ్స్ హాస్టల్‌ను కలెక్టర్ సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, సీడీపీవో కవిత, సఖి సెంటర్ కో ఆర్డినేటర్ స్వప్న, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కళ్యాణ్‌నగర్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో ముస్లిం మైనార్టీలకు రూ.3,003 కోట్లు కేటాయించిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాజా నజీమోద్దీన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాజీమోద్దీన్ మాట్లాడుతూ వార్షిక బడ్జెట్‌లో మైనార్టీలకు మూడు వేల కోట్ల రూపాయలు కేటాయించడం హర్షనీయమని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా బడ్జెట్‌లో మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాష్, మైనార్టీ నాయకులు ఆబీద్, మహ్మద్ ముబీన్, గఫూర్, అక్రం, వాజిద్‌బేగ్, సిరాజ్, ఫజల్ బేగ్, సర్వర్, సయ్యద్, తాజుద్దీన్, యాకూబ్, గౌస్, ఆసిఫ్ పాల్గొన్నారు.



గోదావరిఖనిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీ నాయకులు

జ్యోతినగర్: రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి 30 వేల కోట్ల రూపాయలు కేటాయించడంపై స్థానిక ఎన్టీపీసీ మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జ్యోతినగర్ అధ్యక్షుడు ఎండీ ఆసీఫ్ పాషా ఆధ్వర్యంలో శుక్రవారం మేడిపల్లి సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎ మ్మెల్యే మక్కాన్‌సింగ్ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆసీఫ్ పాషా, ఎంఏ మల్లిఖ్, అబ్బాస్ బేగ్, రియాజ్, రమేష్, గౌస్, శ్రీనివాస్, రాజేశం, యూసఫ్ అలీ, మౌలానా పాల్గొన్నారు.

ఎంపీవోగా బాధ్యతలు స్వీకరణ

పెద్దపల్లి రూరల్ , జూలై 26 : పెద్దపల్లి మండల పరిషత్ అధికారిగా ఫయాజ్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా పెద్దపల్లి ఎంపీవోగా విధులు నిర్వహించిన ఉప్పు సుదర్శన్‌ను పాలకుర్తి మండలానికి బదిలీ చేయగా సుల్తానాబాద్ మండల ఎంపీవోగా విధులు నిర్వహించిన ఫయాజ్‌ను పెద్దపల్లి మండలానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో ఫయాజ్ ఎంపీడీవో శ్రీనివాస్‌ను కలిసి ఆర్డర్ కాపీని అందించిన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఫయాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మండల పంచాయతీ అధికారి గా నూతనంగా బదిలీ వచ్చిన సమ్మిరెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అలాగే పంచాయతీరాజ్ ఏఈగా బదిలీ పై వచ్చిన సచిన్ కూడా బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన అధికారులకు ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావుతో పాటు మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాలకుర్తి, జూలై 26: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని కొత్తపల్లె, కుక్కలగూడూర్, పుట్నూర్ తదితర గ్రామాల్లో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పకుండా ధరించాలని సూచించారు.



అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయండి

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, జూలై 26: ఈనెల 28 నుంచి ఆగస్టు 3వరకు జరిగే అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఏడాది కాలంలో 194 మందికిపైగా అమరులయ్యారని, వారిని స్మరిస్తూ గ్రామాల్లో, బస్తీల్లో అమరుల స్తూపం వద్ద నివాళులర్పించాలని ఆయన కోరారు. మోదీ ప్రభుత్వం దేశ సంపదను అదానీ, అంబానీలకు చౌకగా కట్టబెడుతుందని, తెలంగాణ ప్రజలు దశాబ్దాల కాలం పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణలో ప్రజలకు కనీస హక్కులను కల్పించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు అయినా ప్రజాసమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలిసి మావోయిస్టుని నిర్మూలించేందుకు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూ అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రతిబడ్జెట్‌లో రక్షణ, పోలీస్‌శాఖకు అత్యధికంగా నిధులు కేటాయిస్తూ ఆధునిక ఆయుధాలతో మావోయిస్టులను అణిచివేసేందుకు కుట్ర సాగిస్తున్నారని, దేశ వ్యాప్తంగా మూడు కిలోమీటర్లకు ఒక పోలీస్ క్యాంపును ఏర్పాటు చేసి డ్రోన్ల సహాయంతో గ్రామాలపై బాంబులు వేస్తున్నారని, నరేంద్రమోదీ ప్రభుత్వం దోపిడీ, అణిచివేతలను పెంచిందన్నారు. ఈ సంస్మరణ సభలను ప్రజలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కాంట్రాక్టు కార్మికుడికి విషయంలో స్పందించని యాజమాన్యం

రామగిరి, జూలై 26: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో పరిధిలోని ఓసీపీ-1లో కాంట్రాక్టు కార్మికుడు గాయపడి 24గంటలు గడుస్తున్నా సింగరేణి యాజమాన్యం స్పందించడం లేదని మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ప్రాజెక్టు ఏరియాలో ఆందోళన చేపట్టారు. కార్మికునికి కళ్లకు తీవ్రగాయాలయ్యాయని పేర్కొన్నారు. కార్మికుడికి వైద్య ఖర్చుల కోసం రూ. 50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్, కాంగ్రెస్ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రులకు గ్రీన్‌సిగ్నల్

- ఈఎస్ఐ డీజీని కలిసిన సీఎండీ బలరాంనాయక్

గోదావరిఖని, జూలై 26: సింగరేణి ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రులను ప్రారంభించాలని ఈఎస్ఐ డైరెక్టర్ జనరల్ కమల్ కిశోర్ సోన్‌ను ఢిల్లీలో సింగరేణి సీఎండీ బలరాంనాయక్ కోరారు. గురువారం సాయంత్రం ఆయన ఈఎస్ఐ డీజీని కలిశారు. సింగరేణి ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేస్తే అందుకు సంబంధించిన మౌలిక సదుపాయాలను, క్వార్టర్లను తామే కల్పిస్తామని సింగరేణి సీఎండీ పేర్కొన్నారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సౌకర్యం కోసం ఈఎస్ఐ సేవలను సింగరేణి ప్రాంతంలో విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని ఈఎస్ఐ డీజీని బలరాం కోరారు. సింగరేణి వ్యాప్తంగా 20వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన వివరించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కంపెనీ పక్షాన వైద్య సేవలు అందిస్తున్నామని, అయితే వారి కుటుంబ సభ్యులకు కూడా వైద్య సేవలు అందించేందుకు ఈఎస్ఐ ఆసుపత్రులు అవసరమని వివరించారు. ముందుగా కొత్తగూడెం, సింగరేణి థర్మల్ ప్లాంట్‌ల్లో ఈఎస్ఐ ఆసుపత్రులు ప్రారంభించి సేవలు అందించాలని కోరారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింగరేణి సీఎండీ బలరాం

ఈ సందర్భంగా ఈఎస్ఐ డీజీ కమల్ కిశోర్ మాట్లాడుతూ ముందుగా ఈఎస్ఐ డిస్పెన్సరీలను ఏర్పాటు చేస్తామని, ఆ తరువాత ఆసుపత్రులుగా మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్రంలోని ఈఎస్ఐ అధికారులకు కూడా డీజీ ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టర్లందరూ ఈఎస్ఐ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని, వారి వద్ద పని చేస్తున్న కార్మికుల వివరాలు ఈఎస్ఐలో నమోదు చేయించాల్సి ఉంటుందని సూచించారు. సింగరేణి ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఈఎస్ఐ డీజీకి సింగరేణి సీఎండీ బలరాం కృతజ్ఞతలు తెలిపారు.

గని ప్రమాదాలను విస్మరిస్తున్న సింగరేణి

రామగిరి, జూలై 26: సింగరేణిలో జరుగుతున్న గని ప్రమాదాలను సింగరేణి యాజమాన్యం విస్మరిస్తోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. శుక్రవారం ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణిలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. రక్షణ విస్మరిస్తున్న అధికారులపై తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, రౌతు రమేశ్, నాయకులు రమేశ్, మర్రి సంతోష్, జానీమియా, నగేష్, కొండ్ర ఐలయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

ఓసీపీ-3 ప్రాజెక్టు సమస్యలు పరిష్కరించాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 26: ఓసీపీ-3 ప్రాజెక్టులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రాజెక్టు అధికారి మధుసూదన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి సమస్యలను వివరించారు. ఈపీ ఆపరేటర్ల గ్రేడ్- డీ నుంచి గ్రేడ్-సీ ప్రమోషన్లు ఇవ్వాలని, ఫైలట్ క్వారీలో పొగ దుమ్ము నియంత్రణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఇన్‌సెంటివ్ పాలసీలో మార్పులు చేయాలని, వంద శాతం ఉత్పత్తి వస్తుందని అన్నారు. డోజర్ సెక్షన్‌లో దుమ్ము పేరుకు పోతున్నదని ఎప్పటికప్పుడు నీటిని చల్లించాలని, వాష్‌రూంలు, పెడస్టల్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని కోరారు. బేస్‌వర్క్‌షాప్ అన్ని సెక్షన్‌లలో ఈఓటీ ఏర్పాటు చేయాలని, బేస్‌వర్క్‌షాప్‌లో వేదిక, సైకిల్ షెడ్లను నిర్మించాలని కోరారు. గ్రేడర్‌లో ఏసీలు పనిచేయడం లేదని, వాటికి మరమ్మత్తులు చేయించాలని, హాలర్ రోడ్డు మరమత్తు పనులు చేయాలని కోరారు. బేస్ వర్క్‌షాప్‌లో పర్మినెంట్ ఫోర్‌మెన్లను నియమించాలని, సర్వే సెక్షన్‌లలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎండీ అక్రం, శంకర్ నాయక్, ఎట్టెం కృష్ణ, అయిరెడ్డి సంపత్‌రెడ్డి, ఆకుల రాజయ్య, శ్రీనివాస రెడ్డి, అనంత రాములు, బర్ల రవీందర్, ఓదేలు, శ్రీనివాస్, అవినాష్, రమేష్, అఫ్జల్ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

పెద్దపల్లిటౌన్, జూలై 26: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని పెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేన సురేష్‌గౌడ్, కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్, తాడూరి పుష్పకల శ్రీమాన్ అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణపై మోదీ ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. తెలంగాణకు కేంద్రం బడ్జెట్‌లో ఏం కేటాయించారో ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టిందని కితాబునిచ్చారు. వ్యవసాయ రంగానికి 72 వేల కోట్లు కేటాయించడం దేశచరిత్రలో ఇదే మొదటిసారి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమానికి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నా ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కిందన్నారు. అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉన్న అభివృద్ధి, సంక్షేమ బడ్జెట్ చూసి తట్టుకోలేని బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు రాష్ట్రంలో నూకలు చెల్లినట్లేనని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దొడ్డపల్లి జగదీష్, నాయకులు బొడ్డపల్లి శ్రీనివాస్, బండారి సునీల్ గౌడ్, కొండి సతీష్, భీమోజు సురేందర్, యాట సంగీత్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



గ్రామ కార్యదర్శులను సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ

రామగిరి, జూలై 26: మండలంలోని వివిధ గ్రామాల్లో నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శులను తాజా మాజీ ఎంపీపీ ఆరెల్లిదేవక్క శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ప్రజల సమస్యలు త్వరితంగా పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ రాణి సిబ్బంది పాల్గొన్నారు.

మేడిగడ్డ పర్యటనకు బీఆర్ఎస్ నేతలు

మంథని, జూలై 26: మంథని మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని ఇంచార్జి పుట్ట మధు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మేడిగడ్డ పర్యటనకు మంథని నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు శుక్రవారం తరలి వెళ్లారు. మంథని బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్ లాల్, ఏగోళపు శంకర్‌గౌడ్, ఎక్కేటి అనంత రెడ్డి, గోనె శ్రీనివాస్ రావు ,కనవేన శ్రీనివాస్, ఆరెపల్లి కుమార్, బండ రవి, యాదగిరి రావు, అయూబ్ ఖాన్ అజ్మీరా సమ్మయ్య తదితరులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పాలకుర్తిలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని సందర్శించిన మనాలి ఠాకూర్

పాలకుర్తి, జూలై 26: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని కొత్తపల్లె, పాలకుర్తి, ఈసాలతక్కల్లపల్లి తదితర గ్రామాల్లో మక్కాన్‌సింగ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ ఉచిత శిక్షణ కేంద్రాలను సందర్శించారు.గ్రామాల్లో మహిళ కూలీలతో కలిసి నాటు వేశారు. విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పాటుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్,మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్ పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటిసీలు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

పాలకుర్తి, జూలై 26: మండల పరిధిలోని జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పుట్నూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సాయిసూర్య అధ్వర్యంలో సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పురుశోత్తం,ప్రభుత్వ బాలుర సాంఘీక సంక్షేమ వసతి గృహం వార్డెన్ మెండె సంపత్,పంచాయతీ కార్యదర్శి పెంద్రు సాయి చరణ్,ఏఎన్ఎం నగునూరి సరిత, అశావర్కర్ అడ్డకొండ పద్మ,కారోబార్ బద్దపురి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

● బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, జూలై 26: ఎన్నికల్లో హామీలతో ప్రగల్భాలు పలికి బడ్జెట్‌లో మాత్రం ఆ హామీలను ప్రస్తావనకు కూడా తీసుకురాలేదని, బడ్జెట్‌లో అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీజేపీ రామగుండం ఇంచార్జి కందుల సంధ్యారాణి ఒక ప్రకటనలో ఆరోపించారు. బడ్జెట్‌లో 15శాతం విద్యకు ఖర్చుపెడతామని, ఇంటర్నేషనల్ స్కూల్స్ పెడతామని విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని చెప్పి విద్యార్థులు, యువతను మోసం చేసిందని పేర్కొన్నారు. అలాగే ప్రతి మహిళకు ప్రతి నెల 2500 ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తలేదని, నిరుద్యోగ భృతికి మొండిచేయి చూపెట్టారని, పెన్షన్ 4వేలు పెంచుతామని చెప్పి పెంపు అంశం లేకుండా చేశారని తెలిపారు. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో అత్యధిక ఆదాయం వచ్చే రామగుండం ప్రాంతం, సింగరేణి కార్మికుల గురించి మాట్లాడలేదని, విద్యుత్ సంస్థల నిర్మాణం విషయాన్ని కూడా ఎక్కడా ప్రస్తావించలేదని పేర్కొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, జూలై 26: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు త్వరలోనే యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాల యంలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి కుక్కల సంఖ్య పెరగ కుండా నివారించడానికి వాటికి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేసి, స్టెరిలైజేషన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు గాను మల్కాపూరం ఎస్‌టీపీ సమీపంలోని సెంటర్‌ను త్వరలోనే పునరుద్ధరిస్తామ న్నారు. పెంపుడు కుక్కల యజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. గోదావరిఖని పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పశువులు ఎక్కువగా రోడ్లపై తిరుగుతున్నాయని, వాటి యజమానులు వారం రోజుల్లోగా వాటిని తీసుకెళ్లాలన్నారు. లేకపోతే వాటిని గోశాలలకు తరలించడంతో పాటు యజమానులకు జరిమానాలు కూడా విధిస్తామన్నారు. సమావేశంలో సెక్రటరీ రాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణం, సునీల్, హెల్త్‌అసిస్టెంట్లు సునీల్ రాథోడ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, హ్యాండ్స్ టు సర్వ్ ఫౌండేషన్ ప్రతినిధులు అరవింద్ స్వామి, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.